క్లుప్తంగా

అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం గ్రామ శిల బోనాల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై నిర్వహించిన శివలీల, వినాయక చవితి నృత్య రూపకం చూపరులను ఆకట్టుకుంది. నృత్య రూపకం నిర్వహించిన చిన్నారులను అభినందించి సత్కరించారు. తిరునాళ్ల మహోత్సవాలలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో నరసింహ మూర్తి, వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా అలివేలమ్మ తిరునాళ్ల మహోత్సవం

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు గ్రామంలో అలివేలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు, సహ దేవతలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం రాత్రి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా జబర్దస్త్ టీం సభ్యులు సందడి చేశారు. అనంతరం జబర్దస్త్ టీం సభ్యులను ఎంపీ, ఎమ్మెల్యేలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరకొరగా పశువుల దాణా అందజేత



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ కార్యక్రమం మంగళవారం అరకొరగా జరిగింది. దీనిపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. స్థానిక పశు వైద్యశాల వద్ద జరిగిన కార్యక్రమంలో 50 కిలోల బస్తాలు 20 మంది రైతులకు ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న ఇతర రైతులు అక్కడికి చేరుకుని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో 160 మంది రైతులు ఉండగా కేవలం 20 మంది రైతులకు దాణా పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇటువంటి విధానం సరికాదన్నారు. పశువుల దాణా ప్రస్తుతం 20 మంది వరకు మాత్రమే వచ్చిందని, మరో విడతలో మిగిలిన రైతులకు దాణా వచ్చేలా చూస్తామని లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పూర్ణిమ రైతులకు నచ్చజెప్పారు. దీంతో రైతులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

కుక్కల దాడిలో చూడి గేదె మృతి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఒకటో వార్డు, ఎన్జీవో కాలనీలో పాడి పశువుల యజమాని పాటిబండ్ల నరేంద్రకు చెందిన చూడి గేదెపై ఈనెల 12న కుక్కలు దాడి చేశాయి. దీంతో దాడి చేసిన కుక్కలను వెంటనే స్థానికులు దూరంగా తరిమివేశారు. కాగా కుక్క కరవడంతో విషపూరితమై చూడి గేదె మృతి చెందిందని యజమాని మంగళవారం తెలిపారు. దాని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని, ఇప్పటి వరకు నాలుగు గేదెలు ఇలాగే చనిపోయి నష్టం జరిగినట్లు తెలిపాడు. కుక్కలు కరిచి చనిపోయిన గేదెలకు ఇన్సూరెన్స్ కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. వీధి కుక్కల సంఖ్య పెరిగిపోయి యథేచ్ఛగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని యజమాని వాపోతున్నాడు. మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి నమూనాలను సేకరించాలి



చాత్రాయి: భూ సంరక్షణ కోసం ప్రతి రైతూ తమ భూముల్లోని మట్టిని పరీక్ష చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ పేర్కొన్నారు. మండలంలోని చాత్రాయి గ్రామంలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎకరంలో ఐదు చోట్ల వి ఆకారంలో 15 సెంటీ మీటర్ల లోతులో కిలో మట్టిని తీసుకుని ఎండలో ఆరబెట్టి మెత్తగా చేసి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షల వలన భూమిలో సూక్ష్మ పోషకాలు, స్థూల పోషకాలు అయిన నత్రజని, భాస్వరం, పొటాషియం, జింకు, సేంద్రియ కర్బన పదార్థాలు సమపాళ్లల్లో ఉన్నది, లేనిది తెలుస్తుందని చెప్పారు.

కౌలు.. ఢమాల్

- అడిగేవారే కరువు
- గిట్టుబాటు కాకపోవడమే కారణం
- పెరిగిన పెట్టుబడులు
- కౌలు సాగుకు రైతుల అనాసక్తి

వత్సవాయి: ఈ ఖరీఫ్ సీజన్ రైతులను అప్పుల ఊబిలోకి నెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. దిగుబడి ఉన్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండాపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోవడంతో పొలాలను కౌలుకు తీసుకునేందు ఎవరూ ముందుకు రావడంలేదు.



వత్సవాయిలో సాగుకు సిద్ధంగా ఉన్న భూమి

కారణం ఇదీ..

ఎకరం మిర్చి పంట సాగుచేసిన రైతుకు తక్కువలో తక్కువగా రూ.50 వేల నుంచి లక్ష వరకు నష్టం వచ్చింది. గతేడాది క్వింటా మిర్చి రూ.22 వేలు ధర ఉండగా, ప్రస్తుతం మార్కెట్లో రూ.10 వేలు మాత్రమే పలుకుతోంది. దీంతో కౌలుధరలు గణనీయంగా తగ్గాయి.

ప్రస్తుతం ఇలా..

ప్రస్తుతం ఎకరం రూ.20 వేలకు కూడా తీసుకొనే వారు లేకుండాపోయారు. అది కూడా పంట వచ్చిన తరువాతనే డబ్బులు ఇచ్చేటట్లు అయితేనే తీసుకుంటామంటున్నారు. ఈ ఏడాది కౌలుకు భూములను తీసుకుని వ్యవసాయం చేసేవారి సంఖ్య భారీగా తగ్గనుంది. గతంలో కౌలు ధరలు తక్కువగా ఉండడంతో ఎక్కువ భూములు ఉన్న యజమానులు సుబాబుల్ పంటను సాగుచేశారు. ఈ సీజన్‌లో కూడా అవే పరిస్థితులు ఉన్నాయి.

భారీగా పెరిగిన పెట్టుబడులు..

పత్తి, మిర్చి పంటలకు పెట్టుబడలు కూడా భారీగా పెరిగాయి. కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందుల ధరలు రైతులను కలవరపెడుతున్నాయి. ఒక్కొక్క మందుకట్టకు రూ.100 నుంచి రూ.150 వరకు ధర పెరగ్గా డీలర్లు మరో రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసే పశువులు నానాటికీ తగ్గిపోతుడడంతో ప్రత్యామ్నాయంగా రైతులు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ప్రతి సంవత్సరం పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతుండడంతో ట్రాక్టర్ల కిరాయి కూడా అమాంతంగా పెంచుతున్నారు. ఎకరం దుక్కి దున్నడానికి రూ.2000, గొర్రు, గుంటక, దమ్ము చేయడానికి రూ.1500 ఖర్చవుతోంది. దీనికితోడు కూలీ ధరలు కూడా పెరిగాయి. మహిళలకు కూలీ రూ.250 నుంచి రూ.300 ఉండగా పురుషులకైతే రూ.700 నుంచి రూ. 1000 వరకు కూలీ ఇవ్వాల్సివస్తోంది. వాతావరణం అనుకూలించి, పంటలు సక్రమంగా పండి, దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో పాటు గిట్టుబాటు ధరలు ఉంటేనే రైతులకు తగిన ఫలితం దక్కుతుందంటున్నారు.

గత ఏడాది రైతులకు, కౌలు రైతులకు మేలు..

గతేడాది మిర్చికి మంచి ధర ఉండడంతో కౌలు ధరలు ఒక మాదిరిగా ఉన్నాయి. ఎకరం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పలికింది. పైగా ముందుగా డబ్బులు చెల్లిస్తేనే కౌలుకు ఇచ్చారు. దీంతో భూ యజమానులు కూడా ధరను పెంచేశారు. రైతులు, కౌలు రైతులు కూడా సంతోషంగా ఉన్నారు.

కౌలు రేట్లు తగ్గాయి..



గతేడాది ఈ సమయాని కల్లా పొలాలు కౌలుకు ఇచ్చాం. ఈ ఏడాది ఇంతవరకు కౌలుకు అడిగేవారే లేకుండా పోయారు. కౌలుకు తీసుకోకపోవడానికి ప్రధాన కారణం మిర్చి పంట దెబ్బతినడమే. దీంతో కౌలు రేట్లు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. కౌలు తగ్గడంతో పాటు తీసుకునే వారు కూడా ముందుకురాకపోవడంతో సుబాబుల్ సాగు వైపు భూయాజమానులు చూస్తున్నారు.

– గుత్తా శంకరరావు, రైతు, వత్సవాయి

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

వత్సవాయి: అంగన్‌వాడీ కేంద్రాలలో వేసవికాలంలో కిశోర వికాసంపై బాలికలకు మంగళవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీబీజాన్, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వెంటాడతాయని చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని భీమవరం, మక్కపేట, వత్సవాయి, మంగొల్లు, పెద్దమోదుగపల్లి, గోపినేనిపాలెం గ్రామాలలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం

నందిగామ రూరల్: మహిళా సంరక్షణ, బాలల హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీవో కృష్ణకుమారి పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన హక్కుల గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవటం వలన అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన



అనిగండ్లపాడులో మాట్లాడుతున్న ఎంఎస్‌కే చందన, పక్కన అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: మండలంలోని పెనుగంచిప్రోలు, ముండ్లపాడు, అనిగండ్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా సంరక్షణా కార్యదర్శులు చందన, నాగలక్ష్మి బాలికలకు అత్యవసర సమయాల్లో ఉయోగించుకోవాల్సిన 1098, 100,181,112 హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. పిల్లల్లో ఉత్సాహం కోసం పలు రకాల ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మి, నాగమణి, విమల, ధనలక్ష్మి, జ్యోతి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మునేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని మల్కాపురం గ్రామంలోని మునేటి నుంచి రెండు లారీలు అక్రమంగా ఇసుకను గండ్రాయి, రామచంద్రునిపేట గ్రామాల మీదుగా తెలంగాణకు తరలిస్తున్నట్లు సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. ఎటువంటి అనుమతులు లేకపోవటంతో వాహనాలను సీజ్ చేసి వాల్టా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమ కేసులో అరెస్టయిన కార్యకర్తకు పరామర్శ



వాయిదాకు వచ్చిన దేవదాసు, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తన్నీరు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: అక్రమ కేసులో బాధితులై జగ్గయ్యపేట సబ్ జైలు నుంచి వాయిదా నిమిత్తం జగ్గయ్యపేట కోర్టుకు మంగళవారం వచ్చిన పెనుగంచిప్రోలు మండలం, శనగపాడు గ్రామం వైఎస్సార్ సీపీ కార్యకర్త మొరంపుల దేవదాసును, వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పరామర్శించారు. దేవదాసు యోగక్షేమాలను తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, న్యాయవాది, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కేసర లోకేష్, పార్టీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షన్స్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, బీమవరం నాయకులు రంగారెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మన్నె అప్పారావు, పార్టీ పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో అగ్నిమాపక సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను, గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో కార్మికులు, అధికారులకు వివరించారు. అనంతరం నందిగామ ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. ఇప్పటి వరకు డివిజన్‌లోని అన్ని కర్మాగారాలలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా అవగాహనతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, కర్మాగారం ప్రతినిధులు ఫరూక్, రామ్మూర్తి, రామసాయి, వైద్య, పంచాయతీ రాజ్, అగ్నిమాపక, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ



వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే సౌమ్య

వీరులపాడు: స్వాతంత్ర్య ఉద్యమంలో వడ్డే ఓబన్న అసమాన ప్రతిభ కనబర్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంగళవారం ఆమె ఆవిష్కరించారు. మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమకారుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన అనుచరునిగా ఉన్న వడ్డే ఓబన్న పది వేల మంది సైన్యంతో బ్రిటిష్ వారిపై వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. ఓబన్న పోరాట పటిమను భవిష్యత్ తరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. టీడీపీ నాయకులు దాములూరి మధుసూదనరావు, కాపా రాంబాబు, తమ్మిశెట్టి వీరబాబు, శ్రీనివాస్ కుమార్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పరిశుద్ధ లూర్థుమాత ఆలయ పునఃప్రతిష్ట



పరిశుద్ధ లూర్థుమాత ఆలయ పునః ప్రతిష్టా కార్యక్రమంలో విశ్వాసులు

వీరులపాడు: సకల మానవాళికి సత్యం, జీవం, మార్గం ప్రభువు ఏసుక్రీస్తు అని విజయవాడ మేత్రాసన బిషప్ తెలగుతోటి జోసెఫ్ రాజారావు పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం, బోడవాడ గ్రామాల్లోని పరిశుద్ధ లూర్థుమాత ఆలయ పునః ప్రతిష్టా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ పరిధిలోని దాతలు, విశ్వాసుల సహకారంతో సుమారు రూ.1.60 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మించుకోవటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ నీతిమంతులుగా జీవనం సాగించాలని కోరారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో ధనవంతుడు లాజరు క్రైస్తవ సాంఘిక నాటకం ప్రదర్శించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రెసిడెంట్ కర్ల రాజు, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు మద్దిలేటి లక్ష్మణరావు, యాదాల దాసు, పలువురు ఫాదర్‌లు, పెద్ద సంఖ్యలో భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించండి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని ఐఈఆర్టీ కో–ఆర్డినేటర్ లంకే వెంకటేశ్వరరావు తెలిపారు. దివ్యాంగుల ప్రత్యేక గుర్తింపు కార్యక్రమం గుంటుపల్లిలో మంగళవారం నిర్వహించారు. దివ్యాంగ బాలిక ఇంటికే పరిమితం కావడాన్ని గుర్తించారు. దివ్యాంగ బాల బాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలకు తల్లిదండ్రులకు వారు వివరించారు. ఇంట్లో ఉంచితే మానసిక ప్రశాంతత ఉండదన్నారు. అందరితో పాటు పాఠశాలల్లో చేర్పడం ద్వారా అనేక విషయాలు తెలుసుకుంటారని, సామాజిక అంశాలపై అవగాహన కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వం ద్వారా అనేక రకాల ప్రయోజనం పొందుతారని వివరించారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్



అంబారుపేటలో కూలీల సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు



కంచికచర్లలో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



వీరులపాడులో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

వీరులపాడు: కార్మికులను కట్టుబానిసలుగా మార్చే అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల పేర్కొన్నారు. వీరులపాడు గ్రామంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఈ నెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి మండల స్థాయి సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధిరిత దేశంలో రైతులు పండించిన పంటలను కొనే స్థితిలో ప్రభుత్వం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, కూలీలు, రైతులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లాల్ అహ్మద్ గౌస్, సుబ్బమ్మ, సాయమ్మ, కృష్ణవేణి, సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

భోజన పథకం కార్మికులపై వేధింపులు ఆపాలి

నందిగామ టౌన్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులను ఆపాలని, 45వ కార్మిక సదస్సు నిర్ణయం మేరకు కార్మికులుగా గుర్తించి చట్టబద్ద సౌకర్యం కల్పించి రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించ కూడదని, తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, తదితర సమస్యల పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పథకం కార్మిక సంఘ నాయకులు సుశీల, హనుమంతరావు, పద్మ, జాఫర్, ఉన్నిసా, కరుణ, జైన్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కంచికచర్ల: లేబర్‌కోడ్స్‌ను ప్రభుత్వం రద్దుచేయాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ వెల్లంకి రామారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పని చేసే కార్మికులకు నెలకు రూ.26 వేల జీతం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించి ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈనెల 20న జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం, నాయకులు సుధాకర్, వెంకయ్య, మాధవరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరోగమన విధానాల అమలుకు యత్నం

నందిగామ రూరల్: పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో తిరోగమన సంస్కరణలు, విధానాలను అమలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ యత్నిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ పేర్కొన్నారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఆయన పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో రోజుకు రూ.600 కనీస వేతనం అందించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ కూలీలు, ఉపాధి పథకం కార్మికులు, రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాశీం, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు గ్రంథాలయాలు దోహదం



కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఇస్మాయిల్




పేట గ్రంథాలయంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కంచికచర్ల: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. గ్రంథాలయ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్, కరెంట్ అఫైర్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఇంగ్లిష్ చదవటం, రాయటం నేర్చుకోవాలని, మనస్సుకు పదును పెట్టాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానం దక్కించుకోవచ్చని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. అనంతరం డ్రాయింగ్, చెస్ ఆటలు నేర్పించారు. కార్యక్రమంలో డ్రాయింగ్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు ఎం.కనకారావు, నీలం సర్వేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయురాలు ప్రేమలత శతక పద్యాలను చెప్పి, వారితో చెప్పించి చదివించారు. ఇంగ్లిషు ఉపాధ్యాయుడు వినోద్‌బాబు మాట్లాడే విధానాన్ని విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

సాయి ప్రియకు ఉత్తమ మహిళా సైకాలజిస్ట్ అవార్డు



ఆగిరిపల్లి: మానసిక ఆరోగ్య సేవా రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా డాక్టర్ పేట సాయి ప్రియకు ఉత్తమ మానసిక వైద్య నిపుణురాలు–2025 మహిళా అవార్డు లభించింది. మండలంలోని కనసానిపల్లికి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ పేట సాయిప్రియ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక గ్రామాల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన, శిక్షణ ఇచ్చినందుకు గుర్తింపుగా తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని భాస్కర్ ఆడిటోరియంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం చేతుల మీదుగా ఆమెకు ఈ అవార్డు అందజేశారు. సాయి ప్రియ మాట్లాడుతూ ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మోతుకూరు రామచందర్, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నాగజ్యోతి, ఏపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శ్రీపతి జగదీష్ పాల్గొన్నారు.